## క్లుప్తంగా

### 'మహాపడావో'ను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ఆగస్టు 9న నిర్వహించే మహాపడావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నాయకులు చెరుకు యాకలక్ష్మి, శీలం శ్రీనివాస్, రాధాకృష్ణ, సైదులు, ముత్యాలు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు ఇళ్లు పంపిణీ చేయాలి


ఇళ్లను పరిశీలిస్తున్న బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సంకినేని వరుణ్‌రావు

**నూతనకల్ :** పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సంకినేని వరుణ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని చిల్పకుంట్లలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించారని వాటి మనుగడ కొద్దికాలం మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు. ఆయన వెంట బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబ, పార్టీ మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి, వెంకటమల్లు, వెంకటేశ్వర్లు, వీరబాబు, అనంతరెడ్డి పాల్గొన్నారు.

### సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

**అర్వపల్లి:** మండలంలోని తిమ్మాపురంలో గల అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, జైపాల్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

### సతీష్‌కుమార్ శర్మకు వైభవ ప్రావీణ్య అవార్డు


అవార్డు అందుకుంటున్న సతీష్‌శర్మ

**సూర్యాపేట :** జిల్లా కేంద్రానికి చెందిన రామలింగేశ్వర సహిత త్రిశక్తి, అయ్యప్ప ఆంజనేయ స్వామి దేవాలయ పూజారి రెంటాల సతీష్‌కుమార్ శర్మకు అలంకరణ వైభవ ప్రావీణ్య అవా ర్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవలో సర్‌సీవీ రామన్ అకాడమీ, రుద్రాక్ష పీఠం ఆధ్వర్యంలో 11రాష్ట్రాల్లో విద్య, వైద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక, లలితకళలతో పాటు వివిధ రంగాల్లో ప్రావీణ్యం కలిగిన 108 మంది సామాజిక కార్యకర్తలను గుర్తించి సురక్ష కంకణం, షీల్డ్, ప్రశంసపత్రం, గోల్డ్ మెడల్, పూల కిరీటంతో సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్‌కు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వర్‌రావు, రామచందర్ రావు, సినీ ఆర్టిస్టులు, రాజకీయ నాయకుల చేతుల మీదుగా అవార్డు అందించి సురక్ష కంకణం, షీల్డ్, ప్రశంసపత్రంతో పాటు శాలువాతో సన్మానించారు.

### కలుగీత సొసైటీ చైర్మన్‌గా రాపర్తి పెద్ద శ్రీనివాస్‌గౌడ్

**భానుపురి (సూర్యాపేట) :** సూర్యాపేట పట్టణ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా రాపర్తి పెద్ద శ్రీనివాస్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం ఎన్నికల అధికారి ధరావత్ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్లలో అధ్యక్షుడిగా రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎల్గూరి గోవిందు, ప్రధాన కార్యదర్శిగా గుణగంటి కృష్ణ, కోశాధికారిగా కక్కిరేణి సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్గూరి లక్ష్మమ్మ, కప్పల శశిరేఖ, పాడిశెట్టి వెంకన్న, బొమ్మగాని చిన్న మారయ్య, అయితగాని జనార్దన్‌గౌడ్, సంఘం పెద్దలు, గౌడ ప్రజాప్రతినిధులు, గౌడ కౌన్సిలర్లు, గీత కార్మికులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి

**సూర్యాపేట :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం తొలిదశ ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, చింతలపాటి భరత్ మహాజన్, అనంతుల యాదగిరి, లక్ష్మీకాంతమ్మ, వెంపటి సురేష్, చంద్రునాయక్, నాగరాజు, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏఈ వరుణ్, శ్రావణ్‌కుమార్, గౌస్, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

**సూర్యాపేట రూరల్ :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట క్రైం :** జయశంకర్ జయంతి వేడుకలు ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, రవిలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పట్టణ సీఐ రాజశేఖర్, రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

**తిరుమలగిరి :** మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి ఎంపీపీ నెమరుగొమ్ముల స్నేహలత పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దూపటి అంజలి, కార్యాలయ సిబ్బంది దీపిక, రణధీర్‌రెడ్డి ఉన్నారు.

**ఆత్మకూర్ (ఎస్) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ప్రొఫెసర్ జయశంకర్ సార్ కృషి ఫలితమని మండల పరిషత్ సూపరింటెండెంట్ దయాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ 88వ జయంతి సందర్భంగా మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వామి, తన్నీరు వెంకన్న, పీటర్, సైదులు పాల్గొన్నారు.

**అర్వపల్లి :** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు చక్రహరి నర్సింహరాజు, మల్లెపాక నవీన్, సీఓలు సీహెచ్.సంతోష, నోముల నవీన్, సిబ్బంది రాము, ఉప్పలమ్మ, మంజుల, కార్మికులు పాల్గొన్నారు.


సూర్యాపేట : జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ

**తుంగతుర్తి :** మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, గ్రంథాలయ చైర్మన్ గోపగాని రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు కటకం వెంకటేశ్వర్లు, యాకునాయక్, సాయిలు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

**నాగారం :** ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కూరం మణి వెంకన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ మలిదశ ఉద్యమనేత ప్రొఫెసర్ జయశంకర్ 89వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణివెంకన్న పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగారం ఎక్స్‌రోడ్డులో జయశంకర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శోభారాణి, సూపరింటెండెంట్ ముత్తయ్య, వెంకన్న, సురేష్, రాధిక, ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**పెన్‌పహాడ్ :** మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్మికులు ధనియాకుల శ్రీనివాస్, రణపంగ వెంకన్న, నర్సయ్య, ఎల్లమ్మ, సత్తెమ్మ, మట్టయ్య, పాల్గొన్నారు.

**నూతనకల్ :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏఎస్‌ఓ సందీప్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఢిల్లీలో జయశంకర్ జయంతి వేడుకలు**

**రామగిరి(నల్లగొండ):** దేశ రాజధాని ఢిల్లీలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇండియన్ లైబ్రరీ ఫెస్టివల్‌లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్.. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కలెక్టర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


ఢిల్లీలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ లింగయ్యయాదవ్


తిరుమలగిరి : జయశంకర్ జయంతిలో పాల్గొన్న ఎంపీపీ స్నేహలత, అధికారులు


అర్వపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, అధికారులు


నాగారం : నివాళులర్పిస్తున్న ఎంపీపీ కూరం మణి, తదితరులు


సూర్యాపేట క్రైం : జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీలు


సూర్యాపేట రూరల్ : పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


తుంగతుర్తిలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


ఆత్మకూర్(ఎస్) : జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

## కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

**భానుపురి (సూర్యాపేట) :** రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 28వ వార్డులో రాచకొండ దేవయ్య ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి వార్డులోని ఇంటింటికి తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలు ఇచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ వాటిని విస్మరించి పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎండీ షఫీ ఉల్లా, రాంబాబు, ఫరూక్, నేరేళ్ల మధు, గోపాల్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.


యూత్ డిక్లరేషన్‌పై వివరిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

## ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**ఆత్మకూర్ (ఎస్) :** తెలంగాణ జనసమితి సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మార్జున్ అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరుతూ చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్‌గౌడ్ కోరారు. ఆదివారం యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుడిగా ప్రజలందరినీ ఐక్యం చేయడంలో ప్రధాన పాత్ర పోషించిన ధర్మార్జున్ నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితులను వివరించి ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకు యాత్రతో వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు యాకుబ్‌రెడ్డి, మధు, నితిన్, రాంబాబు, జాని, వినయ్, సాగర్, సతీష్ పాల్గొన్నారు.

## మున్నూరు కాపులకు బీసీ బంధు వర్తింపజేయాలి

**అర్వపల్లి :** మున్నూరుకాపులకు బీసీబంధు పథకాన్ని వర్తింపజేయాలని మున్నూరుకాపు సంఘం మండల నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం నాయకులు మాట్లాడారు. అన్ని గ్రామాల్లో మున్నూరుకాపులకు కమ్యూనిటీ హాళ్లను నిర్మించాలని కోరారు. ప్రతి కులాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెడుతుండగా మున్నూరుకాపులను విస్మరించడం తగదన్నారు. ఎన్నికల లోపే మున్నూరుకాపులకు బీసీ బంధును వర్తింపజేసి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని కోరారు. సమావేశంలో సంఘం మండల నాయకులు దిర్శనపు కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, డాక్టర్ రాజేష్, అరుణ్, యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘం నాయకులు

## నిరుపేద కుటుంబానికి ఆరాధ్య ఫౌండేషన్ అండ


లక్ష్మాపురంలో నూతన ఇంటిని ప్రారంభిస్తున్న తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్

**నాగారం :** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన దుర్సోజు సోమయ్య నిరుపేద కావడంతో ఇళ్ల లేక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుర్సోజు సోమయ్యకు ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్ రాజ్ తమ సొంత ఖర్చులతో ఇంటి నిర్మాణం పూర్తిచేసి, ఆదివారం గృహప్రవేశ కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్‌పర్సన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు ఆరాధ్య ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం నూతన ఇంటిని ప్రారంభించి, ఇంటి తాళాలను సోమయ్యకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంటపల్లి సుధాకర్, ఆరాధ్య ఫౌండేషన్ మండల అధ్యక్షుడు పాశం మధుసూదన్ రెడ్డి, సభ్యులు మల్లెపాక ఎలేందర్, నాగరాజు, ప్రసాద్, సురేష్, వెంకన్న, యాకుబ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనకు ఐక్యపోరాటం

**భానుపురి (సూర్యాపేట) :** ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనకు ఐక్య పోరాటం చేయాలని ఆర్యవైశ్య ప్రముఖులు అన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ కర్నాటి కిషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కేంద్రంలో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఆగస్టు 8న కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలని, 13న జిల్లా కేంద్రంలో ర్యాలీ, సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు కర్నాటి కిషన్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, వుప్పల సంపత్‌కుమార్, రంగయ్య, లక్ష్మయ్య, నాగేశ్వరరావు, అంజయ్య, అంజన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

**సూర్యాపేటటౌన్ :** ప్రజాగాయకుడు, యుద్ధనౌక గద్దర్ ఆకస్మిక మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో గద్దర్ ముఖ్యభూమిక పోషించారన్నారు. ఆయన పాటకు జనం ప్రభంజనమై తరలివచ్చారని గుర్తుచేశారు. అలాంటి మహాగాయకుడు లేని లోటు పూరించలేనిదన్నారు. ఈ సందర్భంగా ఆయన నివాళులర్పించారు.

**ప్రజాగాయకుడు గద్దర్ మృతికి సంతాపం**

**అర్వపల్లి :** ప్రజాగాయకుడు గద్దర్ మృతి పట్ల అర్వపల్లిలో ఆదివారం ఆయన చిత్రపటానికి వివిధ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వారిలో దిర్శనపు కృష్ణమూర్తి, దడిపల్లి వెంకట్, మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్, మత్స్యగిరి, కొలిశెట్టి యాదగిరి, శ్రీను, లక్ష్మణ్, వీరయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

వివిధ సంఘాల నాయకుల సంతాపం..

గద్దర్ మృతికి తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు వేముల గోపినాథ్, సీపీఐ ఎంఎల్ రామచంద్రన్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్దా సత్యనారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బొడ్డు శంకర్, తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ వేణు సంతాపం వ్యక్తం చేశారు.

**మూగబోయిన ప్రజా గొంతుక**

**మద్దిరాల :** ప్రజా కళాకారుడు, యుద్ధనౌక గద్దర్ మృతి బాధాకరమని సీపీఎం జిల్లా నాయకుడు పులుసు సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన పాటలతో ఉద్యమానికి ఊపిరిపోసి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు నాంది పలికారని అన్నారు. అనంతరం ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి భాస్కర్, సైదులు, రాములు పాల్గొన్నారు.


అర్వపల్లిలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

**గద్దర్ మృతి సమాజానికి తీరనిలోటు**

**నూతనకల్ :** ప్రజాగాయకుడు గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరనిలోటని తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా సభ్యుడు గంటా భిక్షపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజంలో పేదల ప్రజలపై జరుగుతున్న అన్యాయాలను తన పాటల ద్వారా ప్రశ్నించిన మహాగాయకుడని ఆయన తెలిపారు.

## మెపా జిల్లా కమిటీ ఎన్నిక

**భానుపురి (సూర్యాపేట) :** సూర్యాపేట పట్టణంలో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోలా కరుణాకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా పిట్టల నాగరాజును ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభ్యున్నతి కోసం మెపా పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర నాయకులు దాసరి వీరన్న, నీటరి రాజు, సింగారపు రామకృష్ణ, నల్లగొండ మెపా జిల్లా అధ్యక్షుడు కట్ల సైదులు, మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు చిల్లా నిరంజన్, నాగరాజు, మణిధర్, మధు, గిరి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా భానుప్రకాష్**

**తుంగతుర్తి :** మండల కేంద్రానికి చెందిన పోతరాజు భానుప్రకాష్ ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండ గడుపుల శ్రీను నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, నితిన్, మధు, సతీష్, హరిప్రసాద్, మధు పాల్గొన్నారు.

**ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ ఎన్నిక**


మాట్లాడుతున్న అధ్యక్షుడు ఆదినారాయణ

**భానుపురి (సూర్యాపేట) :** పట్టణంలో ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ యూనియన్ సమావేశాన్ని ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా రాందేవి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె అక్బర్, ప్రధాన కార్యదర్శిగా పల్స మహేష్ ఎన్నికయ్యారు. సమావేశంలో గౌరవ సలహాదారులు పి.శ్రీనివాసులు, కె.నాగిరెడ్డి, యూసుఫ్, రాజు, ఆర్గనైజర్స్ సారయ్య, సైదిరెడ్డి, రాకేష్, శంకర్, హిమం, లింగయ్య పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**భానుపురి (సూర్యాపేట) :** యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శారీరక మానసిక దారుఢ్యం కలిగి ఉండేందుకు దోహదపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ వద్ద ప్రముఖ యోగా గురువు సిద్ధరాజు తపోధనగిరి స్వామీజీ మృతికి పట్ల ఆయన జ్ఞాపకార్థం భానుపురి ఉన్నత యోగా సాధన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో ఆధ్యాత్మికతకు, యోగాకు అనేక మంది ప్రాముఖ్యత ఇస్తున్నారని, ప్రతిఒక్కరూ యోగా నేర్చుకోవడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, కిరాణా ఫ్యాన్సీ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, ఖమ్మంపాటి రేణు బాబు, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, చల్లమల్ల నరసింహ, వెంకటరెడ్డి, రామ్మూర్తి, రమేష్, ఇందిర, ప్రేమలత, లక్ష్మి, సుధ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

**చివ్వెంల(సూర్యాపేట) :** తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం 32వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమపై నిర్లక్ష్యం వీడి, న్యాయమైన తమ డిమాండ్లను నేరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కె.సాగర్, రాంబాబు, ఈదయ్య, గోపాల్, బానోతు కృష్ణ, మోహన్, సురేష్, ఉప్పలయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**బోనాలతో పంచాయతీ కార్మికుల నిరసన**

**అర్వపల్లి :** తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం 32వ రోజు కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బోనాలు ఆడి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ పాల్గొన్నారు.


చివ్వెంల : సమ్మెలో పాల్గొన్న కార్మికులు

**నూతనకల్ :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కారోబార్‌ల సంఘం జిల్లా నాయకులు నకిరేకంటి శంభయ్య కోరారు. ఆదివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**నేడు ఎముకల సాంద్రత పరీక్ష**

**భానుపురి (సూర్యాపేట) :** పట్టణంలోని ఎస్‌వీఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట మండల సభ్యులకు సోమవారం ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్‌కార్డులను వెంట తీసుకురావాలని కోరారు.

**ఆలయ నూతన కమిటీ ఎన్నిక**

**దురాజ్‌పల్లి (సూర్యాపేట) :** మున్సిపాలిటీలోని 16వ వార్డులో గల ముత్యాలమ్మ దేవాలయ నూతన పాలకవర్గాన్ని స్థానిక కౌన్సిలర్ సలిగంటి సరిత ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ గౌరవ అధ్యక్షుడిగా సలిగంటి సరిత వీరేందర్, అధ్యక్షుడిగా మారం వెంకట్‌రెడ్డి, గౌరవ సలహాదారులతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

**నేడు మండల సర్వసభ్య సమావేశం**

**చివ్వెంల(సూర్యాపేట) :** మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (సోమవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్.లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కుమారి బాబునాయక్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

**ఉపా చట్టం రద్దుకు ఉద్యమించాలి**

**సూర్యాపేట :** ఉపా చట్టం రద్దు కోసం అన్ని కులవృత్తులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఉద్యమించాలని నిర్బంధ వ్యతిరేక వేదిక తెలంగాణ కోకన్వీనర్ రవిచందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మేధ పాఠశాలలో ఏర్పాటు చేసి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కోటయ్య, వెంకన్న, లింగయ్య, నర్సిరెడ్డి, యోగానంద్, నాగేందర్‌నాయక్, వెంకట్ ఉన్నారు.

**ఘనంగా బోనాల పండుగ**

**తుంగతుర్తి :** మండల పరిధిలోని గానుగుబండ, గొట్టిపర్తి గ్రామాల్లో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ముత్యాలమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ముత్యాలమ్మ అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నల్లు రామచంద్రారెడ్డి, చంద వెంకన్న, మహిళా భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఘనంగా సాంబశివుడి జయంతి**

**తిరుమలగిరి :** పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కొనపురి సాంబశివుడు 56వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు పయ్యావుల వెంకన్న, కడెం మల్లయ్య, పనికెర యాదగిరి, చిలుకల లింగయ్య, సోమయ్య, లింగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

**అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తా**

**తిరుమలగిరి :** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని భాషపంగు భాస్కర్ తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో 30ఏళ్లుగా ప్రజా ఉద్యమంలో పాల్గొన్నానని, ఈ ప్రాంత సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందని అన్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశీస్సులతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

**అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ**

**నాగారం :** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠకు ఆదివారం ఎంపీపీ కూరం మణివెంకన్న భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. దళిత వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. గ్రామస్తులందరూ కలిసి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంటపల్లి సుధాకర్, వార్డు సభ్యులు మల్లెపాక సోమలక్ష్మి, చాగంటి మధుసూదన్, అనిల్, వెంకన్న, రవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్‌ఐగా ఎంపికైన నల్లపు రూపశ్రీ**


నల్లపు రూపశ్రీ

**పెన్‌పహాడ్ :** ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఎస్‌ఐ పరీక్షా ఫలితాల్లో మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామానికి చెందిన నల్లపు రాంమ్మూర్తి-శేషలక్ష్మి పెద్దకుమార్తె నల్లపు రూపశ్రీ ఫలితాల్లో 243మార్కులు సాధించి సివిల్ ఎస్‌ఐగా ఎంపికైంది. వ్యవసాయ కుటుంబానికి చెందిన రూపశ్రీ కష్టపడి ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.